కథ

# సొమటైజేషన్

- కొవ్వలి రామకృష్ణ పరమహంస

''సొమటైజేషన్''


''సొమటైజేషన్''

మీ ప్రాబ్లమ్‌ని ''సొమటైజేషన్'' అంటారు.

నాకు ఆ మాట అంత సంచలనం కలిగించలేదు. ఆశ్చర్యం కలిగించలేదు. అలాగని అర్థం కాలేదు. నా నుంచి ఎటువంటి రియాక్షన్ రాకపోయేసరికి....

ఆయనే చెప్పడం మొదలు పెట్టాడు...

సిటీలో సుమారు ముప్పై ఏళ్ళుగా... మంచి హస్తవాసి ఉన్న డాక్టర్‌గా పేరున్న డా. శ్యాంసుందర్ వైద్యాన్ని కేవలం డబ్బు సంపాదన కోసమే కాక తన సంతృప్తి కోసం చేసే డాక్టర్లలో అతనొక్కడు. పేషెంట్‌ని ఫిజికల్‌గా చెక్ చేసి ప్రిస్క్రిప్షన్ యిచ్చేయకుండా అతనిని మానసికంగా స్టడీ చేసి వాళ్లకు దగ్గరయి తర్వాత ట్రీట్‌మెంట్ చెయ్యడం అతని అలవాటు. అందుకే అతని అపాయింట్‌మెంట్ కోసం రోజులు వెయిట్ చేసి తీరాలి. ఒకసారి అతనిని కలిసిన తరువాత మళ్లీ అతనిని కలవాల్సిన అవసరం రాదు. ఈ నోటా... ఆ నోటా... అతని కీర్తి నగరం నలుచెరుగులా పెరిగి అతని ప్రాక్టీస్ సూర్యచంద్రులను చూసే తీరిక కూడా లేకుండా ఆ రూంకే అంకితమయిపోయేలా చేసింది.



మా ఇద్దరి మధ్య డాక్టర్ – పేషెంట్ సంబంధమే కాకుండా ఇతరత్రా విషయాలు మాట్లాడుకునే సాన్నిహిత్యం ఉంది.

ఈ రోజుల్లో ఏదైనా విషయం ఎవరితోనైనా పంచుకునే కోరిక, తీరిక, ఓపిక లేకుండా పోతోంది. మనకిష్టమైన విషయం అవతలి వారికి నచ్చకపోవడం...

అలాగే జీవితంలో ప్రాధాన్యతాంశాలు మారిపోవడం...

మనుషులతో మానేసి మనం యంత్రాలతో సహవాసం చెయ్యడం...

ఇలా చాలా కారణాలే ఉన్నాయి.,

అందుకే నవ్వడం, ఏడ్వడం అనే సహజ ప్రక్రియలకు కూడా మనం దూరమయిపోతున్నాం.

డా. శ్యాంసుందర్‌కి నా మీద పూర్తి అవగాహన ఉంది. నా తెలివితేటల స్థాయిని... ఆలోచనల స్థాయిని... చాలా ఈజీగానే అంచనా వేయగలడు. కానీ నేనొక పట్టాన కన్విన్స్ కానని... నాకెలా చెప్పాలో తెలియక తటపటాయిస్తూ చెబుతున్నట్టు అనిపిస్తోంది.

ఒక్కోసారి ఎంతటి వక్తకయినా... మాటలు కరువవుతూ ఉంటాయి.

దానికి కారణం అవతలి వ్యక్తి ఏమనుకుంటాడో... మనం

సూటిగా మాట్లాడితే అన్న భావనే. అలాంటప్పుడు మౌనం వాళ్ళ మధ్య కమ్యూనికేషన్ సాధనం అవుతుంది.

మా మధ్య నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ... డాక్టర్ గారికి ఫోన్ వచ్చింది.

''బయట పేషెంట్‌లు చాలామంది వెయిట్ చేస్తున్నారు... తొందరగా ముగించమని'' రిసెప్షనిస్ట్ సూచనలా తోచింది వాళ్ళ మాటలు బట్టి.

ఇంపార్టెంట్ కేసని ఓ పావుగంట డిస్టర్బ్ చెయ్యొద్దని సీరియస్‌గా చెప్పి ఫోన్ పెట్టేసారు డాక్టర్.,

డాక్టర్ నాకేసి చూస్తూ... ''ఇంకాస్త డిటైల్డ్‌గా మీ ప్రోబ్లెం చెబితే... మనం ఒక కన్‌క్లూజన్ కొద్దాం... నథింగ్ టు వర్రీ'' అన్నారు.

నాలో సహనం పూర్తిగా చచ్చిపోయింది.

చాలురా బాబు. వీడి దగ్గరకు రావడం నాది బుద్ధి తక్కువ. వీడు నా మీదే రీసెర్చిని మొదలెట్టేసాడు.

మళ్లీ కలుద్దాం... థ్యాంక్స్ చెప్పేసి బయటకు వెళ్ళిపోదామని నిర్ణయించుకొన్నాను.

నా పరిస్థితిని గమనించిన డాక్టర్... ఆయనే అందుకొని... మీరు చెప్పిన దాన్నిబట్టి చూస్తే...

గత కొన్నాళ్లుగా మీకు విసుగు ఎక్కువైంది... చీటికి మాటికీ చిరాకు పడుతున్నారు...

ఎవరైనా... ఏదైనా అడిగితే ఖయ్యిమంటూ లేచి పోతున్నారు.

ఒకరకంగా చెప్పాలంటే మీ ప్రవర్తనకు విరుద్ధంగా అబ్‌నార్మల్‌గా బిహేవ్ చేస్తున్నారు.

కోపం కూడా చాలా ఫ్రీక్వెంట్‌గా ... కాదు రెగ్యులర్‌గా వస్తోంది.

అలా ఉండడం వలన అన్నిచోట్ల...అందరితో అపార్థాలు రావడం....

మీకు శత్రువులు ఏర్పడడం...

మీ మనసు పాడవడం...

ఎట్సెట్రా...

వెరీ నేచురల్.... సింపుల్‌గా చెప్పాలంటే మీరు డిస్టర్బ్ అవ్వడం... మీతో కలిసి సహజీవనం చేస్తున్న వాళ్లంతా డిస్టర్బ్ అవ్వడం...

అంటూ గంభీరంగా ప్రసంగించి... దీర్ఘంగా శ్వాస తీసుకుని...

''దాని మాటకేం గాని.. ఈ మధ్య కథలేమైనా రాసారా... మీ కథలకు నేను కూడా ఒక ఫ్యాన్‌నండి. పుస్తకాలేమైనా రాస్తే ఇవ్వడం మరచి పోకండి. తీరిక చేసుకుని చదువుతాను. ఎంతైనా మీరు చాలా డిఫరెంట్‌గా ఆలోచిస్తారు'' అన్నారు డాక్టర్.

ఆయన ఏ ఉద్దేశంతో డిఫరెంట్ అన్నాడో కానీ... నాకు మాత్రం తిక్కదొబ్బింది.

రాని నవ్వు బలవంతంగా పులుముకొని...

''సార్... బయట పాపం చాలా మంది పేషెంట్‌లు వెయిట్ చేస్తున్నారు.. ఇంకోసారి కలుస్తాను'' అని లేవబోయాను.

''రైటర్‌గారికి నా మీద కూడా కోపం వచ్చినట్టుంది. ఎప్పుడో కానీ అమావాస్యకు, పున్నమికి అన్నట్లు కలుస్తారు తమలాంటి పెద్దలు. మాకా ఈ రూము... పేషెంట్లు... రోగాలు... మందులు.. ఇదే జీవితం... అంతా రొటీన్. మీలాంటి వాళ్ళతో మాట్లాడడమే కాస్త ఆటవిడుపు.

ఈ మధ్య మా అబ్బాయి మన ప్రైంమినిష్టర్, ప్రెసిడెంట్ ఎవరు అంటే పి.వి.నరసింహారావు.. శంకర్‌దయాల్‌శర్మ.. అంటూ నీళ్లు నమిలాను. ఇంత పెద్ద డాక్టర్‌కి ఇవి కూడా తెలియదా! అంటూ నవ్వాడు. అదండి నా జీకే...'' అంటూ నవ్వాడు.

''మీలాంటివాళ్లు కలిసినపుడే కాస్తంత లోకజ్ఞానం అప్‌డేట్ చేసుకుంటాను''

వాతావరణం కాస్త తేలిక పడింది.

మాట్లాడడం ఒక మంచి కళ...

గుండెలు బరువెక్కినప్పుడు మాట్లాడడం...

వాతావరణం వేడెక్కినప్పుడు మాట్లాడడం...

అవతలి వాళ్లను ప్లీజ్ చేస్తూ ప్రేమగా మాట్లాడడం...

ఆ కళలో పరిపక్వత చెందిన వాళ్లకే చెల్లుతుంది.

చతుష్షష్టి కళలకు పరవశించని వాడు చెక్కభజనకు దాసుడవుతాడు... పొగడ్తలకు పొంగనివాడు ప్రపంచంలో లేడన్నది చరిత్ర చెబుతున్న సత్యం... నిర్వివాదాంశం... పొగడ్తలకు చలించనని చెప్పడం ఆత్మవంచనే అవుతుంది.

నా ఆలోచనలను బ్రేక్ చేస్తూ....

''మరీ ఫ్లాష్‌బ్యాక్ వద్దుగానీ పొద్దున్నించీ మీరెన్నిసార్లు డిస్టర్బ్ అయ్యారు. ఎన్నిసార్లు కోపం వచ్చిందో కాస్త గుర్తుకు తెచ్చుకుని చెప్పండి'' అన్నారు డాక్టర్.

''చెబితే మీకు చాలా సిల్లీగా అనిపించొచ్చు డాక్టర్'' అన్నాన్నేను.

''ఫర్వాలేదు..., చెప్పండి'' అన్నారు.

''పొద్దునే ఆఫీస్‌కు రాను.. ఒంట్లో బాగాలేదు.. డాక్టర్ దగ్గరికి వెళ్లాలి అని మా బాస్‌కి ఫోన్ చేసాను''

''వాట్ హేపెండ్? ఎనీ థింగ్ సీరియస్... నాహెల్ప్ ఏదైనా అవసరమా?'' అంటూ చాలా హడావుడి చేసాడు.

నేనేదో మంచాన పడినట్లు.. ఎయిడ్స్... కేన్సర్.. లాంటి రోగాల బారిన పడి చివరి దశలో కొట్టు మిట్టాడుతుంటే.. వాడు చేసే ఓవర్ యాక్షన్‌లా అనిపించి చాలా కోపం వచ్చింది.

వెంటనే ఫోన్‌లో నా మాటలు విన్న మా ఆవిడ వచ్చి....

''ఏవండి ఒంట్లో బాలేదా? అదోలా ఉన్నారు? డాక్టర్‌కు చూపించుకుంటారా?'' అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది.


పిల్లలు పుట్టాక... కనీసం కాసేపు కూర్చొని కబుర్లు చెప్పడం కూడా దానికి కుదరదు.

ఏదైనా అడిగితే... పిల్లల ఆలనా పాలనాతోనే సరిపోతుంది.

మీకేం... ఎన్నైనా చెబుతారు... మిమ్మల్ని కనిపెట్టుకు కూర్చోడానికి... కంట్లో పెట్టుకు చూడడానికి అది వరకటిలా కుదరదు... అంటూ కరాఖండిగా చెబుతుంది.

అలాంటిది అలా వచ్చి అడిగేసరికి... అప్పటికే మా బాస్ గాడి మీద కాక మీదున్నానేమో...

''నీ పిల్లల పెంపకం... ఇల్లు... ఒల్లు.. వంట... పెంట... అన్నీ చూసుకో.. నాకేమైతే నీకెందుకు



అంటూ ఒంటి కాలిమీద లేచాను..'' నివ్వెరపోయింది.

ఇక ఆ తరువాత మీ హాస్పిటల్‌కు ఫోన్ చేసాను. మీ అపాయింట్‌మెంట్ కోసం...

మీ రిసెప్షనిస్ట్ వచ్చీరాని ఇంగ్లీష్‌లో నత్తి నత్తిగా... నేనడిగిన వాటికి తప్పించి... ఏవేవో వాగింది... తింగరముండ అని తిట్టుకున్నాను. మొత్తానికి నంబర్ ఇచ్చిందిలెండి.

ఆ తరువాత మీ దగ్గరకు వచ్చేటప్పుడు కారుకు అడ్డంగా వచ్చిన ఆటోవాడి మీద...

ఒక పక్క ట్రాఫిక్ జాం అవుతున్నా పట్టించుకోకుండా... నీడలో నిలబడి స్టైల్‌గా సిగరెట్టు కాలుస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ మీద...

మీ హాస్పిటల్‌కు వచ్చాక... సుమారు మూడు గంటల నిరీక్షణలో... మీమీద కూడా చాలాసార్లు కోపం వచ్చింది.

"ఒక పట్టాన వదలడు... ప్రోబ్లెంకు మందులు రాసిచ్చి పంపొచ్చు కదా? కుశల ప్రశ్నలను అడగడం... సుత్తికొట్టడం అవసరమా'' అనుకుంటూ తిట్టుకున్నాను.

నా ఆలోచనలు.. చర్యలు తప్పే కావచ్చు. మీరు అడిగారు కాబట్టి ఇవన్నీ చెప్పాల్సి వచ్చింది.

చాలాసార్లు నా చేష్టలు నాకే విచిత్రంగాను... తప్పుగాను అనిపిస్తాయి.

చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఉపయోగమే ముంటుంది. అవతలి వాళ్ళు హర్ట్ అవ్వడం... నాకు దూరంగా అవ్వడం... చాలా లవ్‌బుల్‌గా ఉండి నా కేరక్టర్ ఇలా ఎందుకవుతుందా? అనే నా బెంగ'' అంటూ నా బాధ అంతా వెళ్లగక్కాను.

సావధానంగా నా మాటలు విన్న డాక్టర్... "మీకు లైఫ్‌లో ఏవైనా నిరాశలుకానీ అసంతృప్తులు కానీ ఉన్నాయా?'' అని అడిగారు.

"లేదండీ... నేను చాలా లక్కీయెస్ట్ పర్సన్‌ని... నేననుకొన్నవన్నీ సాధించాను. అనుకూలమైన భార్య.. పిల్లలు... మంచి జాబ్... సంఘంలో హోదా... మర్యాద... మంచి లైఫ్ లీడ్ చేస్తున్నాను...'' అన్నాను.

"పోనీ ఏవైనా టెన్షన్స్... ప్రెషర్స్... డిప్రెషన్స్...'' అడిగారు డాక్టర్.

"నో సార్... అబ్‌సల్యూట్లీ నో...''

పదిమందికి మంచిచెడు చెప్పే పొజిషన్లో నేనున్నాను. చెప్పుకూడదు కానీ... చాలామందికి చాలా విషయాలలో కౌన్సిలింగ్ చేసి వాళ్ల జీవితాలను కూడా చక్కపెట్టాను'' అన్నాను.,

"ఇఫ్ యూ డోంట్ మైండ్... స్మోకింగ్... డ్రింకింగ్ లాంటి హేబిట్స్''

"నో సార్.''

"డయాబిటిక్స్.. బిపి... నెర్వస్‌నెస్... వీక్‌నెస్...''

"ఇప్పటిదాకా భగవంతుడు దయవలన అలాంటివేమీ రాలేదు''

"ఓకే... భగవంతుడ్ని నమ్ముతారా'' అడిగారు డాక్టర్.

"పూర్తిగా... నూటికి నూరుశాతం నమ్ముతాను. అలాగే పూజాపునస్కారాలు కూడా శ్రద్ధగానే చేస్తాను''

"ఆయన మీద కూడా ఎప్పుడైనా కోపం వచ్చిందా?'' అడిగారు డాక్టర్.

"ఆర్ యూ జోకింగ్ డాక్టర్!'' అని అడిగాను.

"నో... మీకు కోపం వచ్చిందా?'' చెప్పండి.

"చాలాసార్లు వచ్చింది. ఆయనను కూడా తిట్టుకుంటాను.. మళ్ళీ లెంపలేసుకుంటాను.''

"మీ సిన్సియారిటీ నాకు నచ్చిందండీ. మీకు ప్రోబ్లెం ఏమీ లేదని చెప్పను గానీ... ఆ ప్రోబ్లెంకు మెడికల్ ట్రీట్‌మెంట్ ఏదీలేదు. కానీ సొల్యూషన్ మీ చేతిలోనే ఉంది. ఇటీస్ నాట్ ఎ డిసీజ్... సింపుల్ టు సే ఇటీస్ ఏ సార్ట్ ఆఫ్ డిజార్డర్. అంటే ఎమోషనల్ ఇంబేలెన్స్ అన్నమాట. ఇంతకు ముందు చెప్పినట్లు దీనిని మా వైద్య పరిభాషలో సొమటైజేషన్'' అంటారు.

"ఈ సొమటైజేషన్ సిటీలో దాదాపందరికీ ఉంటుంది. అందరూ తెలుసుకోలేరంతే..

మీ వృత్తిపరంగా మీకు పరిశీలన... పరిశోధన.. ఎక్కువ కాబట్టి మీ మానసిక స్థితి మూలాలు తెలుసుకోవాలనే తాపత్రయంతో నా దగ్గరకు వచ్చారు....'' అంటూ దీర్ఘోపన్యాసం యిచ్చాడు డాక్టర్.

"మీరు చెప్పిందంతా వింటూంటే... నాకు సొమటైజేషన్ లాంటి టెర్మినాలజీ తెలియదు కానీ... మన మాటల్లో చెబితే దీనిని తిక్క అనొచ్చేమో'' అన్నాను.

"కరెక్ట్! మీరు చెప్పింది అక్షరాలా నిజం. నాకు తట్టలేదు కానీ మనలోని 'తలతిక్క' నే సొమటైజేషన్ అని అంటున్నారు. ఎంతైనా రైటర్స్... అన్నీ తెలిసి... మా చేత చెప్పిస్తున్నారు. మనకు తెలిసింది మనకే చెప్పి... మన దగ్గర ఫీజ్ కొట్టేసాడు అని మళ్లీ తిట్టుకుంటారా?'' అని నవ్వాడు డాక్టర్.

"అలాంటిది ఏం లేదండి... వైద్య నారాయణో హరి అన్నారు మన పెద్దలు'' అంటూ చురకంటించి... "అయినా ఇదంతా నా తెలివి కాదండి. మా ఆవిడ వాళ్ళమ్మతో అంటుందండి. "మా పిల్ల గుక్క... మా ఆయన తిక్క ఒక పట్టాన తిప్పుకోలేరంటూ...'' అదే నేను మీకు చెప్పాను.

"అవును డాక్టర్... ఈ ప్రోబ్లెంకు నన్నేం చెయ్యమంటారు''

"సింపుల్... మనస్ఫూర్తిగా నవ్వడం నేర్చుకోండి... అదే దీనికి మందు'' అన్నారు డాక్టర్.

థ్యాంక్స్

చెప్పి బయట పడ్డాను.

వంట్లో ఎటువంటి అనారోగ్యం లేదని సిటీలో పేరుమోసిన పెద్ద డాక్టర్ చెప్పడంతో చాలా రిలాక్స్ అయిపోయాను.

అక్కడే అసలు ప్రోబ్లెం స్టార్ట్ అయ్యింది.

నవ్వడం ఎలా నేర్చుకోవాలి...

అది నేర్పితే వస్తుందా...

దీనికి ఇనిస్టిట్యూట్‌లు ఉన్నాయా! పుస్తకాలు ఉన్నాయి! కోచ్‌లు ఉంటారా! అంతలోనే ఆలోచనలు ఒక్కసారిగా కమ్మి... ఉక్కిరి బిక్కిరి చేసాయి.

ఆ ఆలోచనలతోనే కారు పార్క్ చేసి... ఇంట్లోకి అడుగుపెట్టాను.

మా మూడేళ్ల పాప.... నవ్వుతూ... నాన్నా అంటూ ఎదురొచ్చింది. ఒకసారి ఎత్తుకొని ముద్దాడాను.

నా ప్రోబ్లెమ్ సాల్వ్... మా పాపే నాకు డాక్టర్... మా పాపే నాకు కోచ్...

దాని దగ్గర బోల్డెన్ని స్వచ్ఛమైన నవ్వులు ఉన్నాయని ఆ క్షణంలో నాకర్థమయ్యింది.

రోజూ కాసేపు దానిదగ్గర ఎలా నవ్వాలో నేర్చుకుంటే నా సొమటైజేషన్ మటుమాయం...

దీనికి కూడా ఏదైనా పేరు పెట్టుకుంటే స్మైలేజేషన్ అనొచ్చేమో...

నవ్వు ఒక వరం కాదు... నవ్వే సర్వం...

నవ్వుతూ బ్రతకాలిరా తమ్ముడు... సిట్యుయేషన్ తగ్గట్టు ఎఫ్.ఎమ్‌లో పాట వినబడుతోంది. మాఇద్దరి నవ్వులు వినబడి... మానవ్వులలో శృతి కలిపారు మా బాబు.. శ్రీమతి... మనసారా నవ్వుకున్నాం...

ఆరోగ్యానికి.... ఫిజికల్‌గా వాకింగ్... మెంటల్‌గా స్మైలింగ్... చాలా అవసరమని అందరికీ చెప్పాలని ఆ క్షణమే గట్టినిర్ణయం తీసుకున్నాను.

ఇంకెందుకు ఆలస్యం.... మీరూ నవ్వడం మొదలెట్టండి... నవ్వుతూనే ఉండండి.

"సకల నవ్వులు ప్రాప్తిరస్తు''

*


చిరునామా:
కొవ్వలి రామకృష్ణ పరమహంస
29, శ్రీ గాయత్రీ నిలయము,
ద్వారకానగర్, తిరుమలగిరి,
సికింద్రాబాద్ - 15.
సెల్: 9849005646




## సైఫ్‌కి కరీనా హ్యాండ్

షాహిద్‌కపూర్‌తో పీకలోతు ప్రేమలో మునిగిపోయి, తెగ డేటింగ్‌లు చేసేసి చివరికి అతనంటే విసుగుపుట్టి అతన్ని వదిలేసి సైఫ్ వెంట తిరగడం మొదలు పెట్టింది కరీనా. ఇండస్ట్రీలో ఎవరూ దొరకనట్టు, పెళ్ళయి, విడాకులు తీసుకున్న వాడితో తిరగడం ఏమిటనీ అందరూ ఓ పక్క ఇంకా చెవులు కొరుక్కుంటూ ఉండగానే సైఫ్‌కి కూడా హ్యాండ్ ఇచ్చే ఆలోచనలో కరీనా ఉందట! ఇటీవలి కాలంలో సైఫ్‌ని సాధ్యమైనంత వరకూ కరీనా తప్పించుకు తిరుగుతుండడమే ఈ ఊహలకు ఊతం ఇస్తోంది. ఇప్పట్లో పెళ్ళి చేసుకునే ఆలోచన లేదంటూ కుండబద్దలు కొట్టిన కరీనా కొత్త ప్రియుడి వేటలో ఉన్నట్టు తాజా సమాచారం!